క్లుప్తంగా

22 నుంచి నవరాత్రి ఉత్సవాలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమ ణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22వతేది నుంచి నవరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆలయంలోని మరగ దాంబికా అమ్మవారు 9 రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమిస్తారన్నారు.

12 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడి పిన 12 మందికి రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ గత రెండు రోజులుగా వాహన తనిఖీలు చేపట్టగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. మొత్తం 12 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

ఆలయ సిబ్బందికి బియ్యం పంపిణీ

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శనివారం ఆలయ సిబ్బందికి బియ్యం పంపిణీ చేశారు. ఏటా బ్రహ్మోత్సవాల అనంతరం సిబ్బందికి బియ్యం అందించడం ఆనవాయితీ. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పెంచల కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. తర్వాత స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

నుంజర్ల ప్రాజెక్టు పరిశీలన



ప్రాజెక్టులో నీటిస్థాయిని పరిశీలిస్తున్న తహసీల్దార్

యాదమరి: మండలంలోని భూమిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న నుంజర్ల ప్రాజెక్టును తహసీల్దార్ పార్థసారథి శనివారం పరిశీలించారు. మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టు జలకళ సంతరించుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం వరద నీటి ప్రవాహ స్థితిని అంచనా వేశారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు నుంజర్ల ప్రాజెక్టుకు అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వేణు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంక్ మేనేజర్ రఘుబాబు

గుడిపాల: ఖాతాదారుల శ్రేయస్సే సింగిల్‌విండో బ్యాంకుల లక్ష్యమని చిత్తూరు డీసీసీ బ్యాంకు మేనేజర్ రఘుకుమార్ తెలిపారు. శనివారం గుడిపాల సింగిల్‌విండో బ్యాంకులో ఖతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్లు చేసిన ఖాతాదారులకు అన్ని బ్యాంకుల కన్నా ఒక శాతం అధికంగా వడ్డీ ఇస్తామన్నారు. సింగిల్ విండో చైర్మన్ ప్రతాప్‌నాయుడు, సూపర్‌వైజర్ ధనుంజయరెడ్డి, సీఈఓ పట్టాభి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు చేయూత



ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియావర్మ

తవణంపల్లె: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిచ్చి ఆదుకుంటున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. శనివారం స్థానిక హైస్కూల్లో పాఠశాల విద్యాశాఖ- సమగ్రశిక్ష సహిత విభాగం ఆధ్వర్యంలో పూతలపట్టు నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఏర్పాటు చేసిన వైద్య నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని 3 నియోజకవర్గాల్లో వైద్యశిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు, సీఆర్పీలు, సహిత విద్య ఉపాధ్యాయులు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వరచౌదరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేదన వినరా..!

అందరి జీవితాల్లో వెలుగులు నింపే విద్యుత్ ఉద్యోగుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయి. వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో వారు తమతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం తమ బాగోగుల గురించి పట్టించుకోవడం లేదని విద్యుత్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలకు దిగారు. అందులో భాగంగా ఈనెల 15 నుంచి వివిధ రూపాల్లో తమ నిరసనలు తెలుపుతూ డిమాండ్లను తీర్చాలని కోరుతున్నారు. సోమవారం నిరసన ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు డిమాండ్లను పరిష్కరించాలని కోరేందుకు సిద్ధమయ్యారు.

- విద్యుత్ ఉద్యోగులపై అధిక పని భారం తగ్గించాలి
- ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను మంజూరు చేయాలి
- డిమాండ్ల సాధన కోసమే నిరసనలకు దిగాం
- సోమవారం జిల్లా కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తాం
- ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం
- విద్యుత్ జేఏసీ నాయకుల హెచ్చరిక

విద్యుత్ పనులు చేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2(ఫైల్), చెరువులోని కరెంటు స్తంభానికి మరమ్మతులు చేస్తున్న లైన్‌మెన్(ఫైల్), వర్షంలోనే పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది(ఫైల్)









రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని రంగాల ఉద్యోగులను మోసం చేస్తోంది. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా విద్యుత్ ఉద్యోగులను చిన్నచూపు చూస్తోంది. వారి డిమాండ్లను పరిష్కరించాల్సి వచ్చినపుడు ప్రత్యేక సంస్థ అంటూ వేరు చేసి, అనుకూలంగా పనిచేయాల్సి వచ్చినపుడు మాత్రం చాకిరీ చేయించుకుంటోంది. ఏడాది గడిచినా వారి కనీస డిమాండ్లను పరిష్కరించకుండా వేధిస్తోంది. దీంతో వారు ప్రభుత్వంపై నిరసన గళం విప్పుతున్నారు.

డిమాండ్లు ఇవీ..

గతంలో 17 డిమాండ్లను అంగీకరించి అమలు పరచలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రభుత్వంతో చర్చలు జరిపినా.. ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో ఉద్యమబాట పట్టినట్లు చెబుతున్నారు. ఉద్యోగుల సంఘాలైన 1104, 327, డిప్లొమా ఇంజినీర్స్, బీసీ, ఓసీ, బహుజన ఉద్యోగ సంఘాలు మొత్తం 23 రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా మారి జేఏసీగా ఏర్పడింది. వీరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలో జేఎల్ఎం గ్రేడ్-2లు 285, కాంట్రాక్ట్ ఉద్యోగులు (షిఫ్ట్ ఆపరేటర్లతో కలిపి) 998, శాశ్వత ఉద్యోగులు 775 మంది ఉన్నారు.

- నగదు రహిత వైద్యం అందించాలి.
- 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలి.
- దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలి.
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. దీర్ఘకాలిక సర్వీసులో ఉన్న వారిని సంస్థలో విలీనం చేయాలి.
- కారుణ్య నియామకాల కల్పనలో కొత్త పద్ధతులను పక్కన పెట్టి పాత పద్ధతినే కొనసాగించాలి.
- జేఎల్ఎం గ్రేడ్-2లను, జేఎల్ఎంలుగా పరిగణించి వేతనాలు ప్రయోజనాలు ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న 4 డీఎలను మంజూరు చేయాలి.
- ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన సబ్‌ఇంజినీర్లకు, ఏఈలుగా పదోన్నతిలో ఒక అవకాశం కల్పించాలి. అర్హులైన ఓఅండ్ఎం ఉద్యోగులను జూనియర్ సహాయకులు, సబ్‌ఇంజినీర్‌గా ఖాళీలలో నియమించాలి.
- అన్ని విభాగాల్లో ఖాళీలు భర్తీ చేయాలి.
- క్షేత్రస్థాయిలో ప్రమాదాలు జరిగినప్పుడు సాంకేతికపరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలి
- 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్వహణ కాంట్రాక్టర్‌కు ఇవ్వరాదని, శాఖపరంగానే నిర్వహించాలి.
- మూడునెలలకోసారి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పీఎన్‌సీ సమావేశాలు పునరుద్ధరించాలి.



ప్రమాదాల్లో గాయపడిన కార్మికులు(ఫైల్)

మొత్తం వైద్య ఖర్చులు చెల్లించాలి



ప్రమాదరంగంలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు వైద్య ఖర్చులు మొత్తం చెల్లించాలి. ఏదైనా విధి నిర్వహణలో ప్రమాదం జరిగినప్పుడు ఆస్పత్రికి వెళ్తే రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. ఆ బిల్లులు క్లెయిమ్స్‌కు పెడితే 60 శాతం మాత్రమే వస్తోంది. అలాకాకుండా ఇతర శాఖల్లో ఉద్యోగులకు ఇచ్చే విధంగా వందశాతం ఇవ్వాలి.

– మురళీకృష్ణ, జిల్లా చైర్మన్ జేఏసీ

డిప్లొమో వారికి పదోన్నతి ఇవ్వాలి



డిప్లొమో చేసి విధులు నిర్వహిస్తున్న ఓఅండ్ఎం సిబ్బందికి పదోన్నతులు కల్పించాలి. ఈ విషయంలో ఇంజినీర్లకు ఎక్కువ అవకాశం ఇస్తున్నారు. దీంతో 25 ఏళ్లుగా ఒకే పోస్టులో పలువురు పదోన్నతి లేకుండా కొనసాగుతున్నారు. లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లకు సబ్‌ఇంజినీర్‌గా, సబ్‌ఇంజినీర్లకు ఏఈగా, ఏఈలకు డీఈగా, ఈఈలుగా పదోన్నతి కల్పించాలి.

– వివేకానందరెడ్డి, జిల్లా కో-చైర్మన్, జేఏసీ

జీపీఎఫ్ ఇవ్వాలి



విద్యుత్‌శాఖలో 1999-2004లో మధ్య చేరిన ఉద్యోగులకు ఈపీఎఫ్ పింఛన్ విధానానికి బదులు జీ పీ ఎఫ్ అమలు చేయాలి. ఇతర శాఖల్లో 2004 ముందు చేరిన వారికి ఈపీఎఫ్ విధానమే అందుబాటులో ఉంది. విద్యుత్‌శాఖలో మాత్రమే ఆ విధానం లేకపోవడంతో ఉద్యోగులు నష్టపోతున్నారు. అలాగే పెండింగ్‌లో ఉండే 4 డీఏలు ఇవ్వాలి.

– యజ్ఞేశ్వరరావు, చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు, జేఏసీ

జేఎల్ఎంలను విలీనం చేయాలి



సచివాలయ పరిధిలో పని చేస్తున్న జూనియర్ లైన్ మెన్ గ్రేడ్-2లను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి. వారు సచివాలయాల్లో పనిచేస్తున్నా.. జీతాలు మాత్రం విద్యుత్ సంస్థ ఇస్తోంది. సంస్థలో విలీనం చేసి సెక్షన్ పరిధిలో విధులకు వారిని వాడుకుంటే పని ఒత్తిడి తగ్గుతుంది. జేఎల్ఎంలతో సమానంగా వారికి జీతాలు ఇవ్వాలి.

– చంద్రశేఖర్, ఈసీ మెంబర్, జేఏసీ

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



సంస్థలో 30 ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వీరికి నేటికీ ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా వారు పని చేస్తున్నారు. కానీ సమాన పనికి సమానవేతనం అమలు కావడం లేదు. వారిని సంస్థలో విలీనం చేసి, దళారీ వ్యవస్థను రద్దు చేయాలి.

– నాగయ్య, నాయకులు, జేఏసీ

సర్వీసు రోడ్డులో వర్షపు నీరు తొలగింపు



సర్వీసు రోడ్డు పక్కన పూడిపోయిన పైపు

సాక్షి ఎఫెక్ట్..

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వెంకటగిరి ఫ్లైఓవర్ వద్ద గల సర్వీసు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'కుంట కాదు..రోడ్డు' అనే శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు సర్వీసు రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాక్షి కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు సర్వీసు రోడ్డు పక్కన వర్షపు నీరు వెళ్లేమార్గం పూడిపోవడంతో పూడిక తీసి సర్వీసు రోడ్డుపై నీరు నిలవకుండా చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విష సర్పాలతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రజలు విష సర్పాలతో జాగ్రత్తగా ఉండాలని, పాము కాటుకు గురైతే తక్షణమే ఆస్పత్రికి వెళ్లాలని డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి సూచించారు. చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఎదుట శనివారం అంతర్జాతీయ పాము కాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో పాముకాటుకు పలువురు బలవుతున్నారని, మరణాల సంఖ్య కూడా అధికంగా నమోదవుతోందని తెలిపారు. ఆపై ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. దీనిపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని వైద్యులకు ఆమె ఆదేశించారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

పాడిపశువులకు టీకాలు

గుడిపాల: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సాయి సుధ అన్నారు. గుడిపాలలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటుతో పాటు పాదుగువాపు, గొంతువాపు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవచ్చన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటుదాం





మొక్కలు నాటుతున్న డీపీఓ సుధాకర్‌రావు, మొక్క నాటుతున్న చిత్తూరు ఎస్పీ దూడీ

యాదమరి : పర్యావరణ సమతుల్యం కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండల పరిధిలోని కీనాటంపల్లి పంచాయతీ షికారికాలనీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పర్యావరణం కాలుష్య బారిన పడడంతో సమస్త మానవాళి ప్రమాదపుటంచున ఉందన్నారు. ప్రతి గృహ యజమాని తమ ఇంటి ఆవరణలో పచ్చని చెట్లను పెంచాలన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య బృందంచే స్వస్థ్- నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా కాలనీ ప్రజలకు ఉచితంగా పలు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. అనంతరం ఆయన స్థానిక నాయకులు అమరనాథ్‌నాయుడుతో కలసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణతోనే భవిష్యత్

చిత్తూరు అర్బన్: పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని సంరక్షించుకుంటేనే మానవాళికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. అలాగే సానిక జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో కూడా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిషోర్, డీఎస్పీలు మహబూబ్ భాష, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు శంకర్‌నాయక్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎఫ్ఓ సుబ్బురాజుకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ విన్నవించారు. శనివారం ఆయన వేర్వురుగా వినతిపత్రాలు సమర్పించారు. జిల్లాలోని గంగవరం మండలం కుయ్యవంక గ్రామంలో దాదాపు 80 ఏళ్లుగా అటవీ ప్రాంతంలో సాగులో ఉన్న గిరిజనుల భూములకు ఆర్ఓఎఫ్ఆర్(2006) యాక్ట్ ప్రకారం ఇప్పటి వరకు హక్కులు కల్పించలేదన్నారు. వాటికి హక్కులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మంజుకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెరటాసి పూజలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): పెరటాసి నెలను పురస్కరించుకుని చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలో ఉన్న గోవింద రాజుల గుట్టలోని శ్రీవారి పాదాలకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో క్యూకట్టారు. శ్రీవారి నామస్మరణతో ఆలయం మార్మోగింది.

బంగారుపాళెంలో..



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లెలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజను నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు.

పండుగ ప్రాముఖ్యం నేర్పాలి



బొమ్మల కొలువుకు పూజలు చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పిల్లలకు పండుగ ప్రాముఖ్యం నేర్పాలని ఎంఈఓ సెల్వరాజ్ సూచించారు. చిత్తూరు మండలం తుమ్మిందలోని శ్రీ విజ్ఞాన తేజ స్కూల్‌లో శనివారం ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. బొమ్మల కొలువుకు పూజలు చేశారు. నిర్వాహకులు కుమార్, రంజని పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గుడిపాల: మాట్లాడుతున్న డాక్టర్ రష్మిత

యాదమరి/ఐరాల/తవణంపల్లె: పౌష్టికాహార లోపంతో ఆరోగ్యం దెబ్బతింటుందని సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సీడీపీఓ వినుతశ్రీ అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి పీహెచ్‌సీలో జరిగిన 8వ రాష్ట్ర పోషణ్ మాసోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐరాల, తవణంపల్లెలో..

ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ఐరాల, తవణంపల్లె మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులు అన్నారు. శనివారం వారి పరిధిలోని గ్రామాల్లో స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

బొమ్మసముద్రం పీహెచ్‌సీలో..

గుడిపాల: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. స్వస్థ్ నారీ -సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం మందికృష్ణాపురంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

ఆక్టోపస్ మాక్‌డ్రిల్



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. దేవస్థానం ఈఓ పెంచల కిషోర్, ఏఎస్పీ నందకిషోర్, ఆక్టోపస్ డీఎస్పీ తిరుమలయ్య, పోలీసు శాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, ఆరోగ్య శాఖల అధికారుల సమక్షంలో ఈ డ్రిల్ చేపట్టారు. ఉగ్రవాదుల దాడులను నివారించడానికి ఎలాంటి ప్రణాళిక నిర్వహించాలనే విషయంపై ఆక్టోపస్‌లు చేసి చూపించారు. కార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్ నాయుడు, వైద్యాధికారి రాజేశ్వరి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఏఈ శివాంజనేయులు, పవన్, ఎస్ఐ, నరసింహులు, బాంబు స్క్వాడ్ బృందం తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ బలగాలు

పీఎంఏవై అంగీకార్ కరపత్రం ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్, కమిషనర్, ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: ఇళ్లలేని పేదలకు గృహాలను మంజూరు చేయడంలో భాగంగా రూపొందించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అర్బన్ 2.0 పథకం అంగీకార్ కరపత్రాన్ని మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆవిష్కరించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంగీకార్ బ్రోచర్ ఆవిష్కరించి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు గృహాలను మంజూరు చేయడంలో భాగంగా పీఎంఏవై అర్బన్ 2.0 ప్రారంభించినట్లు చెప్పారు. ఇల్లు లేని వారిని ఎంపిక చేసి, రుణమేళా నిర్వహిస్తామని, ఇప్పటికే ఇల్లు పూర్తి చేసిన వారికి గృహప్రవేశాలు చేయించడం, రాయితీపై సోలార్ విద్యుత్ అందిస్తామన్నారు. డిప్యూ టీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఎంత వెంకటరామి రెడ్డి, టిడ్కో ప్రతినిధి ధనంజయ రెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

సమిష్టిగా పని చేస్తే సుందర చిత్తూరు సాధ్యం


చిత్తూరు అర్బన్: నగర ప్రజలు, కార్పొరేషన్ సిబ్బంది సమిష్టి బాధ్యత వహిస్తేనే చిత్తూరులో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందని మేయర్ అముద అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమాన్ని వన్నియర్ బ్లాక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు కార్పొరేషన్‌లోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన 1.40 లక్షల టన్నుల వ్యర్థాలను తొలగించి ఆ స్థలంలో పచ్చదనాన్ని పెంచనున్నట్లు చెప్పారు. అనంతరం మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, స్థానిక కార్పొరేటర్ శశి పాఠశాలలో మొక్కలు నాటి నీళ్లు పోశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చిత్తూరు - పూతలపట్టు :
95539 55610



దహనక్రియలు

మంచితనం, మానవత్వం, ఆప్యాయత అనురాగాలకు ప్రతిరూపమైన డా॥ కొత్మ సుధాకర్‌రెడ్డి గారు 20.09.2025వ తేది శనివారం స్వర్గలోకప్రాప్తి చెందినారు

దహనక్రియలు
21.09.2025వ తేది ఆదివారము మధ్యాహ్నం 01.00 గం॥లకు వారి స్వగ్రామము, ఎగువమత్యం, తవణంపల్లి మండలం నందు జరుగునని తెలియజేయడమైనది.

డా॥ కొత్మ సుధాకర్‌రెడ్డి గారు
(Sushma Dental Clinic)
ఎగువమత్యం గ్రామం, తవణంపల్లి మండలం
జననం:14.11.1944 మరణం: 20.09.2025

CHITTOOR SCANS
Near Municipal Corporation Office, Kongareddipalli, Chittoor | Dandupalli Road, Palamaner